# మేడమ్ రోజ్‌హానీ



ఆంగ్లమూలం: ఖలీల్ జిబ్రాన్

తెలుగు అనువాదం: డా॥ రూప్‌కుమార్ డబ్బీకార్

అనువాదకథ

(గతవారం తరువాయి)

**వా**రంతా అర్థంకాని శబ్దాలను ప్రతిధ్వనించే పర్వతాలలో వదిలి వేయబడిన గుయ్యారాలలాంటివారు. భగవత్సూత్రాలను అర్థం చేసుకో లేరు. విస్తారమైన, వైవిధ్యమైన మతంలో అంతస్సూత్రంగా వున్న తాత్వికతనూ అర్థం చేసుకోలేని బలహీనులు. అమాయకులకు, పాపులకు మధ్య గల తేడాను గుర్తించలేని గుణహీనులు. వస్తు విషయాల ఉపరితలాలను స్పర్శించడమే తప్ప అంతస్సూత్రంగా ప్రవహించే వాటిలోని రహస్యాలను ఆవిష్కరించలేరు. అజ్ఞానంతో తమ అభిప్రాయాలను వెల్లడిస్తారు. గుడ్డిగా న్యాయం చెపుతారు. తత్ఫలితంగా నేరస్తుని, నిర్దోషిని, మంచిని, చెడును సరిగా తూచలేరు. ప్రజలకు న్యాయంచెప్పి శిక్షించే ఇలాంటివారిని చూసి బాధపడటంకన్నా చేసేదేమియు లేదు..."

"భగవంతుడి దృష్టిలో నేనొక విశ్వాస ఘాతకిని. ఒక దుష్ట ప్రవర్తన కలిగినదానిని. కాని అది కేవలం రషీద్ బె నమాన్ విషయంలో మాత్రమే. ఎందుకనగా అతను, నన్ను భార్యగా స్వీకరించాడు. ఆచారాలు, సంప్రదాయాలననుసరించి, పరలోకంలో వివాహం అతనితో నిర్ణయింపబడకముందే, అనురాగం, ప్రేమ అనే పవిత్ర సూత్రాలతో నిర్దేశింపబడకముందే, అతని బలవంతపు తొందరపాటు వల్ల నేనతని భార్యగా స్వీకరింపబడ్డాను. ఏ క్షణమైతే అతడిచ్చిన రొట్టెముక్కను తిని, అతను చూపిన ఔదార్యానికి ప్రతిఫలంగా నా శరీరాన్ని అప్పగించానో ఆ క్షణమే భగవంతుడి దృష్టిలోనే కాదు, నా దృష్టిలో కూడా నేనొక నీచురాలిని, పాపిష్టిదాన్నయ్యాను. ఇపుడు నేను పవిత్రురాలిని. ఎందుకంటే, ప్రేమ న్యాయసూత్రాలు నన్నిపుడు స్వతంత్రురాలిని చేసాయి. గౌరవానికి విశ్వాస పాత్రతకు అర్హతను కలిగించాయి. నాకివ్వబడే నీడకోసం నేనిపుడు నా శరీరాన్ని అమ్ముకోవాల్సిన అవసరం లేదు. ఒక గుడ్డముక్క కోసం విలువైన నా రోజులను బలిదానం చేసుకోవాల్సిన అగత్యం లేదు. అవును, ఎపుడైతే సమాజపు దృష్టిలో నేనొక గౌరవప్రదమైన, విశ్వాసపాత్రురాలైన భార్యగా ఉన్న సమయాన నా దృష్టిలో మాత్రం నేనొక వ్యభిచారిణిగా, నీచ స్త్రీ గానే మసిలాను. కాని ఈరోజు సమాజం నన్ను, అపవిత్రురాలిగా భావిస్తున్నపుడు, నా అంతరాత్మ నన్నొక స్వచ్ఛమైన, ఉత్కృష్టమైన ఆత్మగా మన్నించగలుగుతుంది. కారణం, సమాజం న్యాయం కేవలం విషయ వాసనల పైనే ఆధారపడి వెలువడుతుంది. శరీరాన్ని, ఆత్మనుండి వేరు చేసి చూస్తుంది. ఆత్మను అంచనా వేయగల సమర్థత సమాజానికి లేదు".

ఆమె కిటికీ నుండి బయటి ప్రపంచాన్ని చూస్తోంది. విశాలమైన, ఎత్తైన భవంతుల మధ్య అవినీతి రక్కసులు తిరుగాడుతున్నట్లు, అవమానపు నీడల్ని చూసినట్లు తన కుడిచేతిని నగరం వైపును చూపిస్తూ జాలిగా తనంది "చూడు- రాజప్రాసాదుల తలదన్నే ఆ భవంతులు ఆత్మవంచనలకు నిలయాలు. ఆ సౌధాల్లో; అందంగా అలంకరించబడిన ఆ గోడల మధ్య చూస్తున్నావా? కుళ్ళిపోయిన మనస్తత్వాలతో కుసంస్కారుల కదలికలు, బంగారు అద్దకాలతో చిత్రించబడి వెలిగిపోతున్న ఆ ఇంటికప్పుల కింద భేషజాలతో నటిస్తున్న జీవన చిత్రాలు".

"ఆ విలాసవంతమైన భవనాలను చూడు-ఆనందాలకు, ఆడంబరాలకు, అధికారాలకు నిలయాలు.కాని అవి శూన్యస్థానాలు. దుఃఖాలకు, కష్టాలకు, అంతులేని ఆవేదనలకు ఆవాసాలు. నిజానికి, తమ అస్తిత్వాలను పోగొట్టుకుంటూ, సిరిసంపదల బలంతో అధికారాన్ని చెలాయించే మగాడి పశుత్వం కారణంగా, కాటుకకళ్ళ వెనుక,కెంపులాంటి పెదిమల వెనుక దాగివున్న అవమానాల బరువుల్ని మోస్తూ జీవితాన్ని సాగదీస్తున్న అబలల అందమైన సమాధులు".

"ఎత్తైన, దుర్భేద్యమైన ఆ భవనాలు; అవినీతి, వంచన, ద్వేషాలతో నిండి కంపుగొడ్తున్నాయనుకుంటే, అవి పగుళ్ళనిచ్చే సాధారణ కట్టడాలే. నిరుపేద పల్లెజీవి దృష్టి ఆ నివాసాలవైపు పడినపుడు, అతని కంటికొలనులో నీటిచుక్కలు తేలియాడినా, శూన్యమైన శ్రీమంతుల హృదయాల్లో లేని అమృతప్రాయమైన ప్రేమ తమ భార్యల హృదయాల్లో ఉన్నదన్న నగ్నసత్యాన్ని గ్రహించినపుడు, నిండైన నవ్వుతో, తృప్తినిండిన హృదయంతో పొలాల వైపుకి కదలిపోయేవాడు".

> విశాల మైదానంలో పాలరాతి విగ్రహాలతో నిర్మితమైన ఆ సంకీర్ణ గృహాన్ని చూడు. దాని యజమాని విచిత్రమైన వ్యక్తిత్వం కలిగియున్న ఒక అందమైన స్త్రీ. చనిపోయిన తన మొదటి భర్త ద్వారా సంక్రమించిన ఆస్తి, అంతస్తు. ఆ తరువాత, సమాజం నోరుమూయడానికి రక్షణ గా, మానసికంగా ఎదగని, బలహీనమైన ఒక వ్యక్తిని పెళ్ళాడింది. అతన్ని అపవాదుల నుండి రక్షించే ఒక కవచంగా మార్చుకుంది.

ఆ తరువాత 'రోజ్‌హనీ' నా చెయ్యి పట్టుకొని కిటికీ పక్కకు నడిపించుకుంటూ వెళ్ళి ఇలా చెప్పింది "చూడు, ఎవరి దారుల్ని నేను అనుసరించలేక తిరస్కరించానో ఆ దారుల్లో వెలుగుచూడని రహస్యాలను చూపుతాను. ఎత్తైన స్తంభాలతో ఉన్న ఆ ప్రాసాదాన్ని చూస్తున్నాము! తండ్రి వారసత్వంగా వచ్చిన తరగని సంపదతో ఓ వ్యక్తి అందులో నివసిస్తున్నాడు. మురికి కూపంలోని ఓ కీటకంలా జీవితాన్ని గడిపిన తర్వాత ఒక అమ్మాయిని వివాహమాడాడు. ఆమె గురించి అతనికేమీ తెలియదు. తెలిసింది కేవలం ఒక్క విషయమే, అది ఆ అమ్మాయి సుల్తాను దగ్గర పనిచేసే ఒక ఉన్నతోద్యోగి కూతురని మాత్రమే తెలుసు. పెళ్ళితంతు ముగిసిన వెంటనే దాంపత్య జీవితం అంటె అసహ్యించుకొని, ఒక చిన్న వెండిముక్కకు బంగారంలాంటి తమ దేహాన్ని అమ్ముకునే స్త్రీల వెంట సుఖాలకై పరుగులెత్తడం మొదలుపెట్టాడు. అతని భార్య, ఒక తాగుబోతు తాగి వదిలివేసిన ఖాళీసీసాలా, ఆ భవంతిలో పడివుండేది. కష్టమంటే ఏమిటో తెలియకుండ ఎదిగిన తాను మొదటిసారిగా ఏడ్చింది. బాధపడింది. ఆ తర్వాత తెలుసుకుంది. దిగజారిన తన భర్త వ్యక్తిత్వంకన్నా తన కన్నీళ్ళు ఎంతో విలువైనవి. ఇపుడు ఆ స్త్రీ తన ప్రేమికుడి ప్రేమ సాగరంలో మునిగివుంది. ఆనంద సమయాన్ని అతని ప్రేమ, అనురాగపు నీడలో గడుపుతూ, అతని హృదయకలశంలోకి వొంపబడుతున్న అమృతధారలా సాగిపోతుంది".

"అందమైన తోటలతో, దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఆ సౌధాన్ని చూపనీ. ఆ సౌధం తరతరాలుగా ఈ దేశాన్ని పాలించిన, ఒక ఉన్నత వంశానికి చెందిన వారసుడిది. కాని నేడు- ఆనందాలకు, ఆర్భాటాలకు డబ్బును మంచినీళ్ళప్రాయంలా ఖర్చు చేసేవారి విచ్చలవిడితనానికి హారతి కర్పూరంలా ఆస్తి కరిగిపోయింది. కొన్ని సంవత్సరాల క్రితం ఆ వ్యక్తి ఒక శ్రీమంతురాలిని వివాహమాడాడు. ఆమె శ్రీమంతురాలే కాని అనాకారి. అతని భార్య ఇపుడు, తన సమయాన్నంతా కేశాలను వంకీలుగా మార్చే ప్రయత్నంలోనూ, పెదవులపై రంగులు, దేహంపై అత్తరులద్దుకుంటూ కాలం గడుపుతోంది. ఎందుకంటే, ఎవడైన అందమైన యువకుడు తనను చూసి, ఓ నవ్వు విసిరి దరికి చేరకుండా పోతాడాయని, ఆశతో ఎదురుచూడసాగింది. కాని చివరికి అద్దంలో తన వికారరూపమే తనను చూసి నవ్వ సాగింది".


"విశాల మైదానంలో పాలరాతి విగ్రహాలతో నిర్మితమైన ఆ సంకీర్ణ గృహాన్ని చూడు. దాని యజమాని విచిత్రమైన వ్యక్తిత్వం కలిగివున్న ఒక అందమైన స్త్రీ. చనిపోయిన తన మొదటి భర్త ద్వారా సంక్రమించిన ఆస్తి, అంతస్తు. ఆ తరువాత, సమాజం నోరుమూయడానికి రక్షణగా, మానసికంగా ఎదగని, బలహీనమైన ఒక వ్యక్తిని పెళ్ళాడింది. అతన్ని అపవాదుల నుండి రక్షించే ఒక కవచంగా మార్చుకుంది. ఇపుడు తనను కోరుకునే తుమ్మెదల మధ్య మకరందాన్నందించే అందమైన, సుకుమారమైన పువ్వులా..."

"ఆ సంకీర్ణ గృహానికావలివైపున్న మరీ అందమైన ఇంటిని చూడు. ఈ ప్రాంతం మొత్తంలోనే చెయ్యి తిరిగిన ఒక శిల్పి చేతిలో మలచబడింది. ఆ ఇల్లు, సమయాన్నంతా వెచ్చించి, పేదల రక్తాన్ని పిండి ధనాన్ని మూటగట్టే ఒక పరమలోభిది. అద్భుతమైన సౌందర్యరాశి అతని భార్య. బాహ్య సౌందర్యమే కాదు. ఆత్మ సౌందర్యానికీ ఆమె ప్రతీక. కాని అదృష్టం ఆమెనూ అందరిలానే బలిపశువును చేసింది. ఊహ తెలియని వయసులోనే ఆమె తండ్రి అతనికి కట్టబెట్టి చేయరాని ఘోరాపరాధం చేసాడు. ఆమె మెడకు, పెళ్ళి అనబడే భయంకరమైన ఓ గుదిబండను వేసాడు. ఆ బందీఖాన నుండి బయటపడే మార్గంలేక మనోవేదనకు గురై చిక్కిశల్యమైంది. కేవలం డబ్బు కోసమే జీవిస్తూ, తనకు వారసుణ్ణి ఇవ్వలేని గొడ్రాలు అంటూ వేధించే భర్త చెరనుండి బయటపడలేక తనలో తాను కుంగిపోతూ మృత్యువు కు దగ్గరవుతున్నది. తననీ బానిస చట్రం నుండి, ధనాన్ని పోగు చేయడంలోనే సమయాన్ని వృధాచేసే భర్తనుండి విముక్తి కలిగించమని భగవంతునితో మొరపెట్టుకుంటున్నది".

"ఫలాల బరువుతో తూగే వృక్షాల మధ్య కట్టబడిన ఆ ఇంటిలో ఒక ఆదర్శ కవి నివసిస్తున్నాడు. తన సాహితీ కౌశల్యాన్ని తెలుసుకోలేని ఒక మూర్ఖురాలు అతని భార్య. అతని కవిత్వాన్ని పరిహసిస్తూ, ఔన్నత్యాన్ని కించపరుస్తూ అతని నిరాడబర జీవితాన్ని ఏవగించుకుంటూ, అతనితో సర్దుకుపోలేకుండా ఉంది. ఐతే, ఆ కవి తన హృదయాన్ని కదిలించి, కవిత్వానికి ప్రేరణగా నిలిచి, ఉత్సాహాన్ని నింపే ఒక వివాహిత స్త్రీ సాన్నిహిత్యంలో తన నిరాశ, నిస్పృహల నుండి స్వతంత్రుడైనాడు. ఆమె తన అందంతో, ఆకర్షణతో అతని కవిత్వంలోని సౌందర్యానికి, తాత్వికతకు పునరుజ్జీవనం కలిగిస్తోంది. చైతన్యాన్ని జాగరూకతపరుస్తోంది".

కొన్ని క్షణాలు నిశ్శబ్దం ఆవరించింది. మేడమ్ హనీ, ఆ గది మూలల్లో తిరిగి తిరిగి, ఆత్మ డస్సిపోయినట్లుగా, కిటికీ పక్కగా సోఫాలో






కూర్చుండిపోయింది. నెమ్మదిగా తిరిగి తన మనసును విప్పసాగింది.

"ఇలాంటి నివాసాలనే నేను తిరస్కరించినది. ఈ సమాధుల్లోనే నన్ను, నా అంతరాత్మను పాతిపెట్టబడినది. బాహ్య సౌందర్యానికే ఆకర్షింపబడి, ఆత్మ సౌందర్యానికి వికర్షితులై, ప్రేమకు, సౌందర్యానికి తేడాలే తెలియని విగతజీవుల నుండియే నేను స్వేచ్ఛను కోరుకున్నది. భగవంతుడి సృష్టిలోని ఔన్నత్యాన్ని అర్థం చేసుకోలేని వారి దౌర్భాగ్యానికి జాలిపడటం తప్ప ఏమి చేయలేని నిస్సహాయస్థితి. నాకు నేనుగా సరియైన నిర్ణయానికి రాలేకపోతున్నాను. నేను కూడా వారిలోని ఒక భాగమేనేమో. కాని నా మనసును నేను సర్దిచెప్పుకుంటున్నాను. దాని నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నాను. వారిని నేను ద్వేషించటం లేదు. వారిలోని బలహీనతల్ని, మూర్ఖత్వాన్ని మాత్రమే అసహ్యించుకుంటున్నాను. ఇదంతా నీకెందుకు తెలుపుతున్నానో తెలుసా? నేనెవరి అభీష్టాలకు వ్యతిరేకంగా తప్పించుకొని వచ్చానో ఆ వ్యక్తుల భేషజాల ముసుగులోని వాస్తవాలను తొలగించి వెలుగులోకి తీసుకు రావడానికి చేసిన ప్రయత్నమే! నా గురించి ఎవరైతే చెడుగా మాట్లాడుతున్నారో, ఆత్మవంచన చేసుకుంటున్న వారి జీవితాల్లోని నిజాలను బయట పెట్టడమే నేను చేస్తున్నది. అలాంటి నయవంచకుల చీకటి గుడారాల్లోంచి, వెలుగుదారుల్లోకి నా ప్రస్థానాన్ని నిర్దేశించుకుంటున్నాను. నీతి, నిజాయితీ, న్యాయం, సత్యం, ధర్మం ఎక్కడ నివాస మేర్పరుచుకున్నాయో అక్కడే నా గమ్యాన్ని వెతుక్కుంటూ వచ్చాను. వారి సమాజం నుండి నేను బహిష్కరింపబడినాను. నాకు సంతోషమే. ఎందుకనగా, అన్యాయాలకు, అణచివేతకు ఎదురుతిరిగే ఉన్నతమైన ఆత్మలను ఏ మానవత్వమూ బహిష్కరించలేదు కనుక. బానిసత్వం నుండి బహిష్కరింపబడని వ్యక్తికి నిజమైన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలులేవు. ఆ వ్యక్తి సమాజానికి నిబద్ధుడు కాలేడు".

"నిన్నటివరకు నేను పంచభక్ష్యపరమాన్నాలు నిండిన ఒక బంగారు పాత్రను. రషీద్ బె నమాన్‌కు ఆకలి అవసరం వేసినపుడు తప్ప ఆ పాత్ర దగ్గరికి చేరేవాడు కాదు. ఐనా, మా ఇద్దరి ఆత్మలు మా నుండి ఎడంగానే ఉండేవి- విధేయులైన సేవకుల్లా. మనుషులు దేనినైతే దురదృష్టంగా భావిస్తారో ఆ దురదృష్టంతోనే సహజీవనం సాగించాలని చాలా ప్రయత్నించాను. కాని, చీకటి యుగాల మూఢత్వం, మూర్ఖత్వపు ఆలోచనలు, ఇదే నియమం, ఇదే చట్టం అని పేరు పెట్టి పీడించే చాదస్తపు సాంప్రదాయాల విగ్రహం ముందు జీవితాంతం మోకాళ్ళ మీద నిలుచుండి గడపడానికి నా మనసంగీకరించ లేదు. నా ప్రేమ నన్ను పిలిచేంతవరకు ఈ చాదస్తపు సంకెళ్లలో బందీగా ఉండి ఆత్మ విముక్తికై తహతహలాడుతున్న సమయాన; ఆ సంకెళ్ళను తెంపుకొని, ఇనుప పంజరం నుండి విడివడిన పక్షిలా, నేను ఈ ఆడంబరాలను, దాసదాసీ జనాన్ని, నగలు, పట్టు పీతాంబరాలను, రషీద్ బె నమాన్‌ను, అన్నింటినీ వదిలిపెట్టి స్వేచ్ఛావాయువుల నాస్వాదిస్తూ నన్ను నన్నుగా ప్రేమించే వ్యక్తి దగ్గరకు ఎగిరివచ్చాను. నాకు తెలిసినంతవరకు నేను నిజాయితీగానే ప్రవర్తించాను. విధి నన్ను సదా ఏడుస్తూ, బాధపడుతూ జీవించమని కోరలేదు. అనేక రాత్రులు నేను సూర్యోదయాన్ని కోరుకున్నాను. తెల్లవారగానే ఈరోజు ఎప్పుడు గడిచిపోతుందా అని ప్రార్థించేదాన్ని. భగవంతుడు నన్ను బాధాకరమైన జీవితాన్ని గడపమని కోరలేదు. నా హృదయాంతరాలలో ఆనందమనే కోరికను నాటాడు. అతని ఔన్నత్యం నా స్వచ్ఛమైన హృదయానందంలోనే ఉన్నది".

"ఇది నాకథ. భూమిని, స్వర్గాన్ని ధిక్కరించి నిలిచిన నినద భీషణం. ఇదే నా గానం. ప్రజలు వినడానికి భయపడి చెవులు మూసుకున్నా పదే పదే వారి హృదయాల్లో ప్రతిధ్వనించేలా, వారి ఆత్మలు మేలుకునేలా, సమాజపు కుళ్ళు పునాదులు కూలిపోయేందుకు నా గళాన్ని, గానాన్ని వినిపిస్తూనే ఉంటాను".

"ఇది నాకథ. భూమిని, స్వర్గాన్ని ధిక్కరించి నిలిచిన నినద భీషణం. ఇదే నా గానం. ప్రజలు వినడానికి భయపడి చెవులు మూసుకున్నా పదే పదే వారి హృదయాల్లో ప్రతిధ్వనించేలా, వారి ఆత్మలు మేలుకునేలా, సమాజపు కుళ్ళు పునాదులు కూలిపోయేందుకు నా గళాన్ని, గానాన్ని వినిపిస్తూనే ఉంటాను".

"నా ఆనంద శిఖరాల అంచులకు చేరుకునే వరకు, నేను నిర్దేశించుకున్నది ఈ ముళ్ళబాటనే. ఈ బాటలో మృత్యువు ఎదురైనా, భగవంతుడి ముందు తలవంచి ఆనందంతో స్వీకరిస్తాను. విధి ఎలాంటి నిర్ణయం తీసుకున్నా నేను సిద్ధమే. మంచులా స్వచ్ఛమైంది నా మనసు. అతని తీర్పు నాకు సదా శిరోధార్యం. ఆ భగవంతుడి ఇష్టానుసారమే నేను నడుచుకున్నాను. అతను చూపిన దారిలో, నా మనసు సరియైనదని నిర్ణయించుకున్నబాటలో నా హృదయ స్పందన కనుగుణంగానే నేను ముందడుగు వేసాను. ఈ నా జీవిత నాటకంలో 'బేరూత్' ప్రజలు నన్ను ఈ సమాజానికి దాపురించిన ఒక శాపంగా, రుగ్మతగా భావించారు. కాని ఏదో ఒకరోజు, ఏ విధంగానైతే సూర్యకిరణాల స్పర్శతో, మలినపద్మ మట్టినుండి కూడా పూవులు వికసించుకుంటాయో, అదేవిధంగా వారి హృదయాలలో ప్రేమ వికసించుకుంటుంది. ఒకానొక రోజు, బాటసారులు నా సమాధి దగ్గర ఆగి నా దేహాన్ని కప్పివున్న మట్టి పొరల్ని అభినందిస్తూ, స్వచ్ఛమైన ప్రేమ విలువలు సదా జీవిస్తాయని, ఆ భగవంతుడి న్యాయం వృథా కాదని నిరూపించిన ధీశాలి 'రోజ్‌హనీ' ఇదిగో! మనిషి తన కుళ్ళిపోయిన సాంప్రదాయపు భావాలతో తయారుచేసుకున్న చట్టపు సంకెళ్ళను తుంచి బానిసత్వం నుండి విడివడి స్వేచ్ఛను పొందిన 'రోజ్ హనీ' ఇదిగో! ఇక్కడే వుంది- అని గర్వంగా చెప్పుకుంటారు". తన నీడను పుర్రెలు, ముళ్ళకంపల మధ్య పడకుండా ఆమె తన ముఖాన్ని సూర్యుని వైపుకు తిప్పుకుంది.

తెరుచుకున్న ద్వారం గుండా ఒక వ్యక్తిలోనికి ప్రవేశించాడు. మెరిసే అతని కళ్ళలో అద్భుతమైన కాంతి కనబడుతోంది. అతని పెదవులపైన నిండైన దరహాసం ఉంది. మేడమ్ రోజ్‌హనీ ఆ యువకుడి చేతిని పట్టుకొని నన్ను పరిచయం చేసింది. ప్రశంసిస్తూ నా పేరును తెలియపరిచింది. "రోజ్ హనీ, ఎవ్వరికోసం ఈ ప్రపంచాన్నంతా త్యజించిందో, ఎవ్వరికోసం ఈ సమాజాన్ని, సాంప్రదాయపు సంకెళ్లను తెగనరికి వేసిందో ఆ యువకుడు ఇతనేనని ఆ క్షణంలో నేనూహించగలిగాను".

మేము ముగ్గురం అలాకూర్చోగానే, నిశ్శబ్దం పరిసరాలను తన ఆధీనంలోకి తెచ్చుకుంది. ఎవరికివారే లోతైన ఆలోచనల్లో మునిగిపోయాం. ఒకరి పక్క మరొకరు చూడముచ్చటైన జంటగా. ఇంతకుముందెన్నడూ చూడనటువంటి ఒక అద్భుతమైన దృశ్యాన్ని చూస్తున్న అనుభూతి. నిమిషకాలం నిశ్శబ్దంగా దాటి వెళ్ళిపోయింది. మేడమ్ హనీ కథలోని వాస్తవాన్ని గుర్తించగలిగాను. సమాజపు కట్టుబాట్లను తెంచుకొని, తన నిరసన గళాన్ని వినిపించిన రోజ్ హనీ తిరుగుబాటుతనంలోని రహస్యాన్ని ఆకళింపు చేసుకోగలిగాను. నా ఎదురుగా ఒక దివ్యాత్మను చూస్తున్నాను. ఆ దివ్యాత్మలో రెండు సుందరమైన, ఐక్యమైన వ్యక్తులను చూస్తున్నాను. వారిమధ్య దుష్టశక్తుల బారి నుండి వారికి రక్షణగా ప్రేమదేవత తన విప్పారిన రెక్కలతో నిలుచున్నాడు. ప్రేమలో దాగిన గాఢమైన అనుబంధం, నిజాయితీ, దరహాసాలు చిందించే వారి ముఖాలలో ప్రస్ఫుటమవుతూ ఒక సంపూర్ణమైన అవగాహనను దర్శింపజేస్తోంది. సమాజంచేత తిరస్కరింపబడిన, మత చాంధసాల శాపానికి గురైన ఒక స్త్రీ, పురుషుల జంట మధ్య అనంతమైన ఆనందాల రాశిని నా జీవితంలోనే మొదటిసారిగా చూస్తున్నాను. అమలిన ప్రేమానురాగాల, అనుబంధాల అల్లికలతో ఒక పూరిల్లు ఏ విధంగానైతే ప్రేమ మందిరంగా మారిందో, ఆ మందిరం నుండి, వారిద్దరి వద్ద సెలవు తీసుకొని నిష్క్రమించాను. మేడమ్ హనీ చూపించిన భవంతులను దాటుకుంటూ వచ్చాను. ఆ వీధి చివరిలోకి రాగానే రషీద్ బె నమాన్ గుర్తుకు వచ్చి అతని దుర్భరమైన పరిస్థితిని ఊహించుకున్న నాకు, నా అంతరాత్మ మాటలు వినిపించసాగాయి.

"రషీద్ అన్యాయానికి గురైనాడు. మేడమ్ హనీ మీద అతను వేసే నేరారోపణలు ఆ భగవంతుడు స్వీకరిస్తాడా? అతన్ని వదిలి, తన స్వేచ్ఛను వెదుక్కుంటూ వెళ్ళిన ఆమె తప్పు చేసిందా?

(తరువాయి 29వ పేజీలో)

# మేడమ్ రోజ్‌హనీ

(22వ పేజీ తరువాయి)

లేక ప్రేమతో ఆమె హృదయాన్ని జయించకముందే పెళ్ళి అనే పేరుతో ఆమె శరీరాన్నిమాత్రమే లొంగదీసుకోవడం వలన అతను చేయరాని ఘోర అపరాధం చేశాడా? ఈ ఇద్దరిలో అన్యాయానికి గురైనవారు ఎవరు? అన్యాయం చేసింది ఎవరు? ఎవరు నేరస్తులు? ఎవరు అమాయకులు?"


కొన్ని క్షణాల దీర్ఘాలోచన తర్వాత తిరిగి నాతో నేనే మాట్లాడుకోవటం ప్రారంభించాను. "అనేకమార్లు; నగలు, డబ్బు, అందమైన భవంతుల వ్యామోహపు అంధకారంలో లజ్జాహీనురాలై భర్తను విడిచి వెళ్లేందుకే 'వంచన' స్త్రీని ప్రేరేపిస్తుంది. కాని, ఐశ్వర్యవంతుడైన భర్తను వదిలి పేదవాడైన యువకుడి నీడనాశ్రయించిన మేడమ్ హనీకూడా వంచకురాలేనా?! చాలాసార్లు అజ్ఞానం, స్త్రీ గౌరవాన్ని, మర్యాదను మంటగలిపి ఆమెలోని తుచ్ఛమైన కోరికల్ని పునరుజ్జీవింపజేస్తుంది. ఆ కోరికల బరువులో అలిసిపోయి భర్తను వదిలి, మరో వ్యక్తితో లేచిపోయి తనతోపాటు ఆ వ్యక్తిని కూడా అధోస్థాయికి దిగజారుస్తుంది. భౌతికవాంఛలతో, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల నెపంతో బహిరంగంగా తను కోరుకున్న వాడి పంచన చేరిన మేడమ్ హనీ కూడా అజ్ఞానురాలేనా? తన భర్త ఇంటి వద్దనే ఉంటూ రహస్యంగా తన కోరికల్ని తీర్చుకునే అవకాశాలు ఆమెకు మెండుగానే ఉన్నాయి. ఆమె అందానికి దాసోహమనేవారు, ఆమె ప్రేమకోసం ఆత్మత్యాగం చేసే వారెందరో కదా! మేడమ్ హనీ దురదృష్టవంతురాలు. ఆమె తన సంతోషాన్ని మాత్రమే కోరుకున్నది. దానికై అన్వేషించి స్వంతం చేసుకుంది. ఇదే సత్యం. ఈ నిజాన్ని సమాజం ఆమోదించదు".

"భర్తను దుర్భరమైన పరిస్థితుల పాల్జేసి వాటి ప్రతిఫలంగా తన ఆనందాన్ని కొనుక్కునే హక్కు స్త్రీకున్నదా?" అంటూ నా అంతరాత్మని ప్రశ్నించుకుంటూ ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచాను. నా అంతరాత్మ తన గొంతును జతకలిపింది- "భార్యగా ఆమె ప్రేమ తనపై లేదని తెలిసికూడా. ఆమెను తన బానిస సంకెళ్ళతో బంధించటం మగాడికి న్యాయమేనా?"

* * *

నగర పొలిమేరల్లోకి వచ్చేంతవరకు మేడమ్ హనీ మాటలు నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. సూర్యుడు అస్తమిస్తున్నాడు. నిశ్శబ్దం పొలాలను, ప్రహరీలను ఆక్రమించుకుంటోంది. సాయం సంధ్యా గీతాలను పక్షులు పాడనారంభించాయి. ధ్యాసంతా అక్కడే నిలబడిపోయి ఆ సుందర దృశ్యాలను వీక్షిస్తూ, సేద తీరుతూ ఇలా అనుకున్నాను-" "చంద్ర కిరణాలను స్నానిస్తూ, సూర్యకిరణాలతో తమ దేహాన్ని ఆరబెట్టుకుంటున్న చెట్టూ చేమ తమ కొమ్మరెక్కలతో మందమారుతాలను వీచుతూ స్వేచ్ఛా సింహాసనానికి ఎదురుగా ఆనందనాట్యాలు చేస్తున్నాయి. స్వేచ్ఛగా పక్షులు గుసగుసలాడుతున్నాయి. గలగలా పారే వాగులు వంకలు స్వేచ్ఛా సంగీత స్వరాలతో సరాగాలాడుతున్నాయి. స్వేచ్ఛాగగన వీధుల్లో ఈ సుమాలు తమ పరిమళాలను శ్వాసిస్తున్నాయి. స్వేచ్ఛా కన్నులు సంధ్యాకన్యకను నవ్వులతో పలకరిస్తున్నాయి".

"ఈ నేలమీద ప్రతిప్రాణి ప్రకృతి నియమానుసారమే మనుగడ సాగిస్తున్నాయి. ఆ నియమాలే స్వేచ్ఛాంగులైన ఆనందాన్ని, ఔన్నత్యాన్ని ప్రసాదిస్తాయి; కాని మనిషి తన అజ్ఞానందే ఈ అదృష్టాన్ని కాలదన్నుకుంటాడు. ఎందుకనగా, మనిషి భగవంతుడిచ్చిన ఆత్మను తన ఐహిక వాంఛలతో బంధిస్తున్నాడు. తనకు తానే నియమాల కఠినమైన సంకెళ్ళను వేసుకుంటున్నాడు. మనిషి, ఇరుకైన, బాధాకరమైన కారాగారాన్ని నిర్మించుకొని అందులో తన అనురాగాన్ని, కోరికలను అన్నింటికి దూరంగా బంధించి ఒంటరివాడవుతున్నాడు. ఒక లోతైన సమాధిని తవ్వుకొని తన హృదయాన్ని, దాని లక్ష్యాన్ని పాతేసుకుంటున్నాడు. సమాజపు కట్టుబాట్లను తెంపుకొని నియమాలకు విరుద్ధంగా తన ఇష్టానుసారం ప్రవర్తిస్తే, తోటి సమాజమే అతన్నొక విధ్వంసకారుడిగా, సంఘ బహిష్కరణకు తగినవాడుగా భావించి శిక్షకు అర్హమైన నీచమైన ప్రాణిగా నిర్ణయిస్తుంది. ఒంటరివాడై, తనకు తానుగా నిర్మించుకున్న జైలులో ఒక ఖైదిగా, ఒక బానిసగా, ఈ ప్రపంచం చివరాఖరువరకు ఉండగలడా? లేదా గడిచిపోతున్నకాలంతో పాటు స్వతంత్రుడై జీవితాన్ని జీవితంగా జీవించగలడా? మనిషి తన మంకుతనంతో, వెనుకబాటుతనంతో అధోగతులను వెతుక్కుంటూనే ఈ భూమ్మీద వుంటాడా? లేదా తన నీడను ఈ ముళ్ళకంపల మధ్య, ఈ పుర్రెల మధ్య చూడకుండా ఉండటానికి తన దృష్టిని ప్రచండమైన ఆ భాస్కరునివైపే మళ్ళించుకుంటాడా?"




## కళారంగానికే అంకితం



రామారావు

నాకిప్పుడు 58 సంవత్సరాల వయసు. చేనేత వృత్తితో జీవనాన్ని కొనసాగిస్తూ కళారంగంలో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని, అ సేవకే అంకితమయ్యాను. 1972లో దివంగత కర్న వాసుదేవమూర్తి వద్ద సంగీతాన్ని అభ్యసించి, నాటినుంచీ అనేక ప్రదర్శనలు ఇచ్చాను. పలు భక్త సమాజాల వారికి భజనలు నేర్పించాను. హార్మోనియం, డోలకలలోనూ ప్రత్యేక శిక్షణ పొందాను. 'ఆకాశవాణి' భజన కార్యక్రమాలలో పాల్గొనడమేకాక రంగస్థల నటునిగా అనేక పాత్రలలో నటించాను. అభిరుచి గల వారికి సంగీతాన్ని బోధించాలని ఉంది.

*-అంపా బత్తిన రామారావు*, జాంద్రపేట

## పేదవారికి వైద్యసేవలు



హుసాముద్దీన్

ఇప్పుడు నాకు 83 సంవత్సరాలు. ఈ వయసులో కూడా ఊరికే ఉండకుండా ప్రజలకు ఉచిత వైద్యసలహాలు ఇస్తున్నాను. ఆయా ప్రాంతాల ప్రభుత్వ దవాఖానాలలో వైద్యునిగా పనిచేశాను. అప్పట్నించే బీదలకు ఉచితంగా వైద్యసేవలు అందించే వాణ్ని. కొన్ని సందర్భాలలో రోగులకు చేతనైన మేర ఆర్థిక సహాయం కూడా చేసేవాణ్ణి. 1996 దాకా ప్రత్యక్ష సేవలలో కొనసాగాను. అనేక దీర్ఘరోగాలకు ఆయుర్వేదంలో గొప్ప చికిత్సా విధానాలున్నాయన్నది నా విశ్వాసం.

*-డా॥మహమ్మద్ హుసాముద్దీన్*, చంపాపేట్, హైదరాబాద్

## పంచాంగ సలహాలు



సూర్యనారాయణ

పోస్ట్‌మాస్టర్‌గా 2001లో రిటైర్ అయ్యాను. నాకు గల పంచాంగ విజ్ఞానం మేరకు పదిమందికీ ఉపయోగపడేలా శాస్త్ర సలహాలు ఇస్తున్నాను. ఎప్పుడు, ఎవరు ఫోన్ చేసినా నాకున్న తీరిక సమయం మేరకు వారు ఆశించిన శుభ ముహూర్తాలు, వివాహ, గృహ, ప్రయాణాదులకు కావలసిన శుభ సమయాలను సూచిస్తున్నాను. అయితే మాకెన్ని పనులున్నా ప్రతి ఆదివారం నేను మా అన్నగారి ఊరువెళ్లి అక్కడ అందరం కలిసి గడపడంలో ఒక విలువైన అనుభూతిని పొందుతున్నాను.

*-కొత్తపల్లి సూర్యనారాయణ*, విశాఖపట్నం

*మీరూ ఆదర్శవంతులైన వృద్ధులా! మీదైన బాటలో సమాజ శ్రేయస్సుకు పాటుపడుతున్నారా? ఇంకెందుకు ఆలస్యం? వెంటనే మీ వివరాలు, ఫొటో పంపండి. ఇక్కడే వాటిని ప్రచురిస్తాం. మా చిరునామా: జీవన సంధ్య, ఎడిటర్, 'ఆదివారం వార్త', వార్త దిన పత్రిక, లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-80*